క్లుప్తంగా

నేటి నుంచి ఉచిత యోగా శిక్షణ తరగతులు

తాండూరు టౌన్: ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉచిత యోగా శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్లు సంఘం ప్రతినిధులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక ఆర్యవైశ్య ఓపెన్ ఆడిటోరియంలో బుధవారం సాయంత్రం 6గంటలకు శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. గురువారం నుంచి ఉదయం 5.30 గంటల నుంచి 7 గంటల వరకు, సాయంత్రం 6 గంటల నుంచి 7.30 గంటల వరకు రెండు బ్యాచ్‌లతో తరగతులు జరుగుతాయని వెల్లడించారు. శివానంద ఆచార్య యోగా గురుజీ ఆధ్వర్యంలో జరగనున్న తరగతులకు అందరూ ఆహ్వానితులే అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బస్సులను పునరుద్ధరించండి


డీఎంకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

నవాబుపేట: కరోనాకు ముందు నారెగూడ గ్రామానికి 5 ట్రిప్పులు తిరిగిన ఆర్టీసీ బస్సులు ఇప్పుడు రావడం లేదని, వెంటనే వాటిని పునరుద్ధరించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సర్పంచ్ పర్మయ్య ఆధ్వర్యంలో 20 మంది గ్రామస్తులు డీఎం బిచ్చునాయక్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. గతంలో నారెగూడకు నిత్యం బస్సులు వచ్చేవని, ప్రస్తుతం ఒక్క సర్వీసు రాకపోవడంతో నారెగూడతో పాటు సిద్దులూర్, పూలపల్లి, గంగ్యాడ గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తక్షణమే బస్‌లను నడిపించి రవాణా కష్టాలు తీర్చాలని పేర్కొన్నారు. డీఎంను కలిసినవారిలో దళితరత్న అవార్డు గ్రహీత శివరాజ్, గ్రామస్తులు ఉన్నారు.

ఈ తీగలు సరి చేయరూ..


మేకవనంపల్లిలో శ్రీనివాస్ పొలంలో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు

మోమిన్‌పేట: పొలాల్లో విద్యుత్ తీగలు రైతులకు తగిలే విధంగా కిందకి వేలాడుతున్నా.. సంబంధిత అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని రైతులు ప్రశ్నిస్తున్నారు. పలుమార్లు ట్రాన్స్‌కో సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పొలాలను దున్నే సమయంలో రైతులకు, ట్రాక్టర్ డ్రైవర్‌కు తగిలి ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులని వాపోతున్నారు. మోమిన్‌పేట మండలం మేకవనంపల్లిలో శ్రీనివాస్‌కు సంబంధించిన పొలంలో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ చేతికి తగిలే విధంగా ఉన్నాయి. వాటిని సరిచేయాలని చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి తీగలను సరిచేయాలని కోరుతున్నారు.

మద్దతు తెలిపితే అరెస్ట్ చేస్తారా?


నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం జిల్లా నాయకుడు చంద్రయ్య తదితరులు

బొంరాస్‌పేట: మహబూబాబాద్‌లో లాఠిచార్జికి గురైన భూపోరాట పేదలను పరామర్శించేందుకు వెళ్లిన ప్రజాసంఘాల నేతలపై దౌర్జన్యం చేసి, అరెస్ట్ చేయడాన్ని తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక సీపీఎం పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని ఆ పార్టీ జిల్లా నాయకుడు బుస్స చంద్రయ్య అన్నారు. మంగళవారం బొంరాస్‌పేట మండలం తుంకిమెట్ల నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించడం సరికాదన్నారు. భూపోరాట పేదలకు మద్దతు పలికిన తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్, గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామ్‌లను అరెస్టు చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. అంతే కాకుండా సంఘటనను చిత్రీకరించేందుకు వెళ్లిన మీడియా ప్రతినిధులపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారని ఆరోపించారు. నిరసనలో సీపీఎం పార్టీ నాయకులు రమేష్, భీక్యా, బాలయ్య, ప్రకాశ్, వెంకటయ్య, పెంటమ్మ తదితరులు పాల్గొన్నారు.


అనంతగిరి: వికారాబాద్ శివారెడ్డిపేట్ జెడ్పీహెచ్‌ఎస్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనంద్


పరిగి: ఖుదావన్‌పూర్‌లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి తదితరులు


ధారూరు: విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సుజాత తదితరులు


మోమిన్‌పేట: పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి

విద్యతోనే వికాసం

'ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య లభిస్తుంది. విద్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ మనఊరు–మనబడి కార్యక్రమంతో తెలంగాణ ప్రభుత్వం.. బడి భవనాలను కార్పొరేట్ విద్యాలయాలుగా తీర్చిదిద్దింది. విద్యార్థులకు సకల సదుపాయాలు కల్పించింది' అని ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఊరూరా విద్యాదినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో జాతీయ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. విద్యతోనే వికాసం లభిస్తుందని, విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నతికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు వ్యాస రచన, చిత్రలేఖనం తదితర పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. – సాక్షి, నెట్‌వర్క్


నవాబుపేట: ఆదర్శ పాఠశాలలో పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ భవాని


యాలాల: విశ్వనాథ్‌పూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయబృందం


పెద్దేముల్: బాలికల పాఠశాలలో.. ఉపాధ్యాయులు, విద్యార్థులు


తాండూరు రూరల్: గౌతపూర్‌లో చిన్నారులకు అక్షరభ్యాసం చేయిస్తున్న సర్పంచ్ రాజప్పగౌడ్


కొడంగల్ రూరల్: హస్నాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, సర్పంచ్ పకీరప్ప


మర్పల్లి: బూచన్‌పల్లిలో డిజిటల్ తరగతులను ప్రారంభిస్తున్న సర్పంచ్ జయ, హెచ్‌ఎంలు


కొడంగల్: జాతీయ గీతం ఆలపిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


దోమ: విద్యార్థినికి నగదు ప్రోత్సాహకం అందజేస్తున్న విశ్రాంత ఉపాధ్యాయుడు బిచ్చిరెడ్డి


దౌల్తాబాద్: విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ విజయ్‌కుమార్ తదితరులు

నేడు ఆధ్యాత్మిక దినోత్సవం

తాండూరు రూరల్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆధ్యాత్మిక దినోత్సవం నిర్వహించాలని ఎంపీడీఓ సుదర్శన్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని గ్రామాలు, తండాల దేవాలయాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి ప్రత్యేక పూజలు చేయాలని, భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేయాలని సూచించారు.

కొడంగల్‌లో..

కొడంగల్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో ఆధ్యాత్మిక దినోత్సవం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఉదయం 8 గంటలకు మెథడిస్ట్ చర్చిలో ప్రార్థనలు, 10 గంటలకు పద్మావతి సమేత మహాలక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయంలో సుదర్శన హోమం, మధ్యాహ్నం ఒంటి గంటకు మక్కా మసీద్‌లో ప్రార్థనలు ఉంటాయని తెలిపారు.

సద్వినియోగం చేసుకోవాలి

కుల్కచర్ల: ప్రభుత్వ బడులను గ్రామీణ ప్రాంత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ రాందాస్ నాయక్ అన్నారు. మంగళవారం చౌడాపూర్ మండలం మక్తవెంకటాపూర్‌లో నిర్వహించిన బడిబాటలో ఆయన మాట్లాడారు. సర్కారు బడుల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు.. నాణ్యమైన విద్యను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, స్థానిక ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ప్రతి పైసకు లెక్క ఉండాలి

బంట్వారం: ఉపాధిహామీ పనుల్లో ప్రతి పైసకు లెక్క పక్కాగా ఉండాలని కోట్‌పల్లి ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. 2020 నవంబర్ నుంచి మార్చి 2023 వరకు చేపట్టిన ఉపాధి పనులపై 15 రోజులుగా గ్రామాల్లో సోషల్ ఆడిట్ జరిగింది. ఈ సందర్భంగా మంగళవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ప్రజా వేదికలో ఆయన మాట్లాడారు. రెండు సంవత్సరాల నాలుగు నెలల కాలంలో కోట్‌పల్లి మండలంలో రూ.18.48 కోట్లు ఖర్చు చేశామని, జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి పని కల్పిస్తున్నట్లు వెల్లడించారు. డిషనల్ డీఆర్‌డీఓ స్టీవెనిల్, ఏపీడీ సరళ, అంబుడ్స్‌మెన్ జిల్లా అధికారి రాములు, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, ఏపీఓ ఎలీష, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

డిజిటల్ విద్యకు ప్రాధాన్యత

ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

బషీరాబాద్: రాబోయే రోజుల్లో ప్రభుత్వం డిజిటల్ విద్యకు అధిక ప్రాధాన్యత ఇవ్వనుందని తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన విద్యాదినోత్సవంలో పాల్గొన్నారు. పర్వత్‌పల్లి పాఠశాలలో మనఊరు–మనబడి కింద రూ.10 లక్షలతో చేపట్టిన గ్రంథాలయ నిర్మాణం, మరమ్మతు పనులను, నవల్గా జెడ్పీ పాఠశాలలో డిజిటల్ తరగతులను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. విద్యతో వ్యక్తి వికాసం, గ్రామాభివృద్ధి జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో గురుకులాల ద్వారా పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందని చెప్పారు. ప్రైవేటు బడులకు దీటుగా గురుకులాల్లో ఇంగ్లిష్ మీడియంలో నాణ్యమైన విద్యా బోధన జరుగుతుందన్నారు.


నవల్గాలో డిజిటల్ బోర్డుపై రాస్తున్న ఎమ్మెల్యే

కార్యక్రమంలో సర్పంచ్‌లు బేగం, లాలుప్రసాద్, పార్టీ మండలం అధ్యక్షుడు నర్సిరెడ్డి, రైతుబంధు సమితి అధ్యక్షుడు పాండురంగారెడ్డి, సీనియర్ లీడర్ గోపాల్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, రాఘవ రెడ్డి, ఎంపీడీఓ రమేష్, ఎంఈఓ సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

యాలాల: రాస్నం గ్రామానికి చెందిన పలువురు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి తండ్రి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు విఠల్‌రెడ్డి సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. గ్రామానికి చెందిన మంగలి అశోక్, సారా అశోక్‌కుమార్, బాలమణి, సంజయ్, రఫీక్, నర్సింహులు, శేఖర్, దస్తప్ప, బందెప్ప, అనంతయ్య, రాములు, పండరి నర్సింహులు, మొల్ల షఫీ తదితరులు అధికార పార్టీలో చేరారు. ఈ సందర్భంగా విఠల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతుందని, గతంలో ఎన్నడూ లేని విధంగా నిధులను తెచ్చిన ఘనత ఎమ్మెల్యేకు దక్కుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ అశోక్‌రెడ్డి, సీనియర్ నాయకులు రాంచంద్రారెడ్డి ఉన్నారు.


పార్టీలో చేరిన నాయకులతో విఠల్‌రెడ్డి

గతుకుల రోడ్డు.. డొక్కు బస్సులు!

- కోట్‌పల్లి రూట్‌లో ప్రయాణికుల అవస్థలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, ఆర్టీసీ అధికారులు

బంట్వారం: అసలే గతుకుల రోడ్డు. ఆపై వాటిపై దూసుకెళ్లే కాలం చెల్లిన బస్సులో ప్రయాణం చేస్తే ఎలా ఉంటుందో చాలా మంది ప్రయాణికులు తెలుసు. ఇప్పుడు కోట్‌పల్లి రూటులో ప్రయాణికులు అవే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో ఆదాయమే తప్ప.. ప్రయాణికుల తిప్పలు ఆర్టీసీ అధికారులకు పట్టవని, రాజకీయమే తప్ప ప్రజల కష్టాలు నాయకులు పట్టించుకోరని పలువురు ఆరోపిస్తున్నారు. అంతే కాకుండా ప్రజా సంక్షేమమే లక్ష్యమని చెప్పుకుంటున్న ప్రభుత్వం కూడా.. రహదారులు, ఆర్టీసీ బస్సుల ఫిట్‌నెస్ గురించి పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. బస్సు చార్జీలు పెంచడంలో చూపుతున్న శ్రద్ధ, కొత్త బస్సులు కొనుగోలు చేయడంలో సంస్థ ఆసక్తి చూపడం లేదని, చేసేదేమీ లేక ఆర్టీసీ అధికారులు ఫిట్‌నెస్ లేని బస్సులను పల్లెలకు పంపుతూ ఆదాయ మార్గమే ముఖ్యమన్నట్లు వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు.

విరిగిన సీట్లు.. వేలాడుతున్న ఇనుప చువ్వలు!

వికారాబాద్ డిపోకు చెందిన లోకల్ బస్సు ఒకటి కోట్‌పల్లి మండల కేంద్రానికి రోజుకు ఐదు ట్రిప్పులు తిరుగుతోంది. కండీషన్ లేని ఈ బస్సులో ప్రయాణికులు నిత్యం బిక్కుబిక్కుమంటూ ప్రయాణిస్తున్నారు. వికారాబాద్ నుంచి కోట్‌పల్లి వరకు రోడ్డంతా గుంతలే. వర్షా కాలంలో అయితే బస్సు ఎప్పుడు ఎక్కడ దిగబడుతుందో తెలియని పరిస్థితి. విరిగిన సీట్లు, వేలాడే ఇనుప చువ్వలు, దుమ్ముధూళితో నిండి ఉన్న బస్సులో ప్రయాణిస్తున్నామని, ఒక్కోసారి బ్రేక్ కూడా సరిగా పడడం లేదని, ప్రాణాలు అర చేతిలో పెట్టుకొని గమ్య స్థానాలకు చేరుకుంటున్నామని ప్రయాణికులు భయాందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రైవేటు వాహనాల్లో ప్రయాణం వద్దు, ఆర్టీసీ బస్సుల్లోనే ముద్దు అంటూ సంస్థ అధికారులు.. కేవలం ప్రకటనలకే పరిమితం అవుతున్నారని, కాలం చెల్లిన బస్సులు తిప్పుతూ ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలం చెల్లిన సర్వీసులను తొలగించి, కొత్త వాటిని తిప్పాలని పరిసరప్రాంత ప్రజలు కోరుతున్నారు.


వికారాబాద్, కోట్‌పల్లి రూట్‌లో గుంతల రోడ్డు


కోట్‌పల్లి లోకల్ బస్సు

సర్కారు బడుల బలోపేతానికి కృషి


పాఠశాలకు సామగ్రి అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్

పరిగి: ప్రభుత్వ పాఠశాలల సమస్యలు పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ అన్నారు. పట్టణ కేంద్రంలోని 1వ వార్డు మల్లెమోనిగూడ ప్రాథమిక పాఠశాలలో కుర్చీలు, టేబుల్స్ లేవని ఉపాధ్యాయులు చైర్మన్ దృష్టికి తీసుకురావడంతో.. మంగళవారం ఆయన సొంత డబ్బులతో సామగ్రి అందజేసి మాట్లాడారు. పాఠశాలకు ఎలాంటి సాయం కావాలన్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. పాఠశాలలకు ప్రభుత్వం ఎన్నో సౌకర్యాలను కల్పిస్తుందని, విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ విద్యాలయాల్లో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మౌలానా, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయికి ఉపాధ్యాయుల ఎంపిక

బొంరాస్‌పేట: బోధనోపకరణాల తయారీలో బొంరాస్‌పేట, దుద్యాల మండలాలకు చెందిన పలువురు ఉపాధ్యాయులు జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. జిల్లా కేంద్రంలోని శివారెడ్డిపేట ఉన్నత పాఠశాలలో జరిగిన విద్యా దినోత్సవంలో ప్రదర్శనలు చేశారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉపాధ్యాయులు.. బొంరాస్‌పేట పాఠశాలకు చెందిన లక్ష్మి(ఈవీఎస్), కాశీపతి(తెలుగు), ఎన్కెమీదితండా శశివర్ణ, బొట్లోనితండా రాజశేఖర్(ఈవీఎస్), లోతికుంటతండా శశిధర్(ఆంగ్లం), దుద్యాల మండలం చిల్మల్‌మైలారానికి చెందిన కవిత(గణితం), గౌరారానికి చెందిన శ్రీనివాస్, దుద్యాల జెడ్పీహెచ్‌ఎస్ తెలుగు భాషోపాధ్యాయులు సుధాకర్‌రావు, పీఎస్ శ్రావణి ఎంపికయ్యారు. వీరిని డీఈఓ రేణుకాదేవి, ఎమ్మెల్యే ఆనంద్, ఆర్‌డీఓ సన్మానించారు.


బోధనోపకరణాల తయారీలో జిల్లా స్థాయికి ఎంపికైన ఉపాధ్యాయులు

కొనసాగుతున్న అండర్ డ్రైనేజీ పనులు

తాండూరు రూరల్: బిజ్వార్ గ్రామంలో అండర్ డ్రైనేజీ పనులు కొనసాగుతున్నాయి. సామల సాయప్ప ఇంటి నుంచి లింగారెడ్డి ఇంటి వరకు, కొమటి వెంకటయ్య ఇంటి నుంచి బస్టాండ్ వరకు పనులు ప్రారంభమయ్యాయని సర్పంచ్ నరేందర్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి కృషితో గ్రామానికి ఎస్‌డీఎఫ్ నిధులు రూ.50 లక్షలు మంజూరయ్యాయని, రూ.30 లక్షలతో సీసీరోడ్లు, రూ.20 లక్షలతో అండర్ డ్రైనేజీ పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

త్వరలో మురుగు కాలువలు

కుల్కచర్ల: గ్రామస్తులకు ఇబ్బంది లేకుండా మురుగుకాల్వలను ఏర్పాటు చేస్తామని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక చిన్నగేటు సమీపాన రోడ్డు విస్తరణ అనంతరం డ్రైనేజీ సమస్య తలెత్తగా.. త్వరలోనే మురుగు కాల్వలు నిర్మిస్తామని స్థానికులకు ఆయన తెలిపారు.

ఏఓగా తిప్పేస్వామి



దౌల్తాబాద్: దౌల్తాబాద్ మండల వ్యవసాయ అధికారిగా తిప్పేస్వామి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన ఏఓ లావణ్య పరిగి మండలానికి బదీలి అయ్యారు. హైదరాబాద్ వ్యవసాయ కమిషనర్ కార్యాలయంలో పని చేస్తున్న తిప్పేస్వామి.. దౌల్తాబాద్‌కు వచ్చారు.

గొల్లకుర్మల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

- దశల వారీగా అర్హులకు గొర్రెల పంపిణీ
- కుర్మసంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

పెద్దేముల్: గొల్ల కుర్మలు అన్ని రంగాల్లో ఎదగాలని కుర్మసంఘం జిల్లా అధ్యక్షుడు కోహీర్ శ్రీనివాస్ ఆకాంక్షించారు. మంగళవారం పెద్దేముల్ మండలం జనగాంలో రెండో విడతలో మంజూరైన గొర్రెలను లబ్ధిదారులకు పంపిణీ చేసి మాట్లాడారు. కుర్మలు అభ్యున్నతి చెందాలనే ఉద్దేశంతో ముఖ్యమంతి కేసీఆర్.. గొర్లను పంపిణీ చేస్తున్నారని చెప్పారు. మండలానికి మొదటి దశలో 405, రెండో దశలో 407 యూనిట్ల గొర్లను పంపిణీ చేసినట్లు వెల్లడించారు. జనగాం గ్రామంలో 12 యూనిట్లను అందజేశామని తెలిపారు. 2017లో ఏ గ్రూప్‌నకు పంపిణీ చేయగా, బి గ్రూప్‌నకు ప్రస్తుతం పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. దరఖాస్తు పెట్టుకున్న ప్రతి గొల్ల కుర్మకు దశలవారీగా గొర్లు పంపిణీ చేస్తామని చెప్పారు. డాక్టర్ వెంకటపతి రాజు మాట్లాడుతూ ఒక యూనిట్‌కు రూ.1.75లక్షలు ఖర్చు అవుతుందని, అందులో 20 గొర్రెలు, ఒక పొట్టేలు ఉంటుందని, ప్రతి లబ్ధిదారు రూ.43,750 ప్రభుత్వానికి డీడీ చెల్లిస్తే.. ప్రభుత్వం రూ.1.75లక్షలు మంజూరు చేస్తుందని వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు స్వప్న, సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు జగదీశ్వర్, ఉపాధ్యక్షుడు పూజారి పాండు, బీఆర్‌ఎస్ నాయకుడు ముకుందరెడ్డి, పశువైద్యాధికారి డాక్టర్ వెంకటపతిరాజు, సంఘం జనగాం గ్రామ అధ్యక్షుడు పెద్ద నర్సప్ప, మాజీ సర్పంచ్ రవినాయక్, రంగయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.


గొర్రెలు పంపిణీ చేస్తున్న కుర్మసంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు

చిన్నారులకు అక్షరభ్యాసం

బషీరాబాద్: ప్రతి చిన్నారిని అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలని అంగన్‌వాడీ టీచర్ శశికల అన్నారు. మంగళవారం కంసాన్‌పల్లి(ఎం)లో ఆమె చిన్నారులకు అక్షరభ్యాసం చేయించారు. అనంతరం గ్రామంలో అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా టీచర్ మాట్లాడారు. పిల్లలకు సన్న బియ్యంతో అన్నం, పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందిస్తున్నామని, చిన్నారులను అంగన్ బడికి పంపించాలని తల్లిదండ్రులకు కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ అనురాధ, ప్రత్యేక అధికారి జయశ్రీ, ప్రధానోపాధ్యాయుడు యాదగిరి, బ్రంహ్మానందరెడ్డి, కార్యదర్శి విశాల్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


అక్షరభ్యాసం చేయిస్తున్న అంగన్‌వాడీ టీచర్